హైదరాబాద్ యూనివర్సిటీ వివాదంపై కె. బాలగోపాల్ వ్యాఖ్య

# విజ్ఞత బోధనాంశం మాత్రమేనా?



కె. బాలగోపాల్

యూనివర్సిటీలలో చదువుతున్నవాళ్ళూ, చదువు చెప్పేవాళ్ళూ పుష్కలంగా ఉంటారు. చదువుకున్న విషయ పరిజ్ఞానమూ విజ్ఞతా రెండూ ఉంటాయని మామూలుగా భావిస్తాం. కానీ తరచుగా మన యూనివర్సిటీలలో కనిపించేది ఏమిటంటే పండితులు అనిపించుకున్న వారికి కూడా ఒక పరిమితమైన పరిధిలో మాత్రమే విషయ పరిజ్ఞానం ఉన్నా, విజ్ఞత అసలే ఉండదు. విచారణ జరగకుండా ఎవరినీ శిక్షించడానికి వీలు లేదనేది విషయ పరిజ్ఞానం ఉన్నా, విజ్ఞత ఉన్నా సులభంగానే అర్థం కావలసిన విషయం. ఆధునిక రాజ్యాంగాలలో అదొక అనుల్లంఘనీయమైన సూత్రం కాగా, చాలా ప్రాచీన కాలం నుండి అది మానవ నాగరికత ఎరిగిన విలువ. అవి రెండూ తెలియని హైదరాబాద్ విశ్వ విద్యాలయం పాలనాధికారులు పదిమంది విద్యార్థులను జనవరి 10వ తేదీన క్యాంపస్‌లో జరిగిన అల్లరి పర్యవసనంగా విశ్వవిద్యాలయం నుండి తొలగించారు. ఆ పదిమంది రీసెర్చ్ స్కాలర్లు. ఈ దశలో ఒక యూనివర్సిటీ వాళ్ళను రస్టికేట్ చేస్తే వేరే ఏ యూనివర్సిటీలోనూ వాళ్ళకు తమ పరిశోధన కొనసాగించే అవకాశం ఉండదు. అంటే వారికి జీవితాంతం పి.హెచ్.డి పట్టా లేకుండానే ఉండిపోవాలి. విద్యారంగంలో వారికది చాలా తీవ్రమైన శిక్ష.

ఇంత పెద్ద శిక్ష ఏ విచారణా లేకుండా విధించగల హైదరాబాద్ విశ్వవిద్యాలయం పాలకవర్గాన్ని ఏమనాలి? పైగా విచారణ ఎందుకు జరపలేదని ప్రశ్నిస్తే, వెంటనే చర్య తీసుకోకపోతే క్యాంపస్‌లో తీవ్ర వ్యతిరేకత వచ్చి ఉండేదని అంటున్నారు. రేపు ఈ ప్రొఫెసర్లలో ఒకరి మీద డిపార్ట్‌మెంట్ పైసలు తిన్నాడన్న ఆరోపణ పెట్టి 'వెంటనే' చర్య తీసుకోకపోతే సమాజంలో 'తీవ్ర వ్యతిరేకత రాగలదు' అని చెప్పి ఏ విచారణా జరపకుండా బర్తరఫ్ చేసే ఊరుకుంటారా? సహజ న్యాయ సూత్రాలకు విఘాతం కలిగిందని సుప్రీం కోర్టు దాకా పోయి రచ్చ చేయరా? చేస్తారు. వాళ్ళకు విషయ పరిజ్ఞానం లేదన్నది నిజం కాదు. దేనిని ఎవరికి వర్తింపచేయాలన్న విషయంలో వారికి కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి. అ 'పాత్రదానం' కూడదన్న బ్రాహ్మణీయ విలువను వారు ప్రాథమిక హక్కులకూ సహజ న్యాయసూత్రాలకూ కూడా వర్తింపజేస్తారు. ఇంక విజ్ఞత విషయానికొద్దాం. ఈ చర్చ కేవలం విచారణ జరపకుండా శిక్ష వేయవచ్చునా అన్న సహజ న్యాయ సూత్రం దగ్గర ఆగిపోదు. ఆ 10మంది చేసిన తప్పుకు - అది తప్పనే ఒప్పుకుందాం- అంత కఠినమైన శిక్ష వేయతగునా అన్న ప్రశ్న కూడా ఇప్పుడు వేసుకుందాం. సామాజిక విషయాలలో పైకి కనిపించేదే పూర్తి సత్యం కాదనీ పైకి కనిపించని పార్శ్వాలూ ఉంటాయనీ, మనుషులకు విషయాల గురించి ఉండే అభిప్రాయాలు కొంతవరకు ఆ విషయాల స్వభావాన్నీ కొంతవరకు ఆ చూసేవారి దృక్కోణాన్నీ ప్రతిఫలిస్తాయని, ఈ దృక్కోణాల వెనక బలమైన సామాజిక శక్తులూ ప్రయోజనాలూ పని చేస్తాయనీ గుర్తించడం సామాజిక పరిశోధనకు పునాదిప్రాయమైన విషయం. పైకి సత్యాలుగా కనిపించే విషయాలనూ, నిష్కపటంగా ధ్వనించే అభిప్రాయాలనూ సందేహించడం నేర్చుకున్నప్పుడే సామాజిక శాస్త్రం ప్రారంభమయింది. హైదరాబాద్ విశ్వవిద్యాలయంతో సహా అన్ని పరిశోధనా కేంద్రాలలోని సామాజిక శాస్త్రవేత్తలూ ఈ సందేహంతోనే-కనీసం పరిశోధనలు చేసేటప్పుడు-ప్రపంచాన్ని చూస్తారు. అయితే ఇది బయటి ప్రపంచానికే తప్ప తమ క్యాంపస్‌కు వర్తించదని వారనుకుంటున్నారేమోనని ఇప్పుడు సందేహించాల్సి వస్తున్నది. ఎక్కడో జరిగే అల్లర్లను కేవలం హింసగా కాకా ఒక సామాజిక విషయంగా చూసి, చూడడం విద్యార్థులకు నేర్పి, పరిశోధనా గ్రంథాలు రాయగల సామాజిక శాస్త్రవేత్తలు కొలువుతీరి ఉన్న విశ్వవిద్యాలయం తన విద్యార్థులు చేసిన హింసను క్షమించరాని నేరంగా భావించి విచారణ కూడ అక్కరలేకుడ రస్టికేట్ చేసేయడాన్ని ఇంకొక రకంగా అర్థం చేసుకోలేము.

ఇదంతా యూనివర్సిటీ అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ అరాచక చర్యలను సమర్థించడానికి ప్రయోగిస్తున్న కుతర్కం అని భావించే వారు ఉంటారు. అల్లర్లకూ హింసకూ ఉండే మూలాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం సంఘవ్యతిరేక స్వభావం గల కుతర్కమేనన్న అనుమానం చాలామందిలో ఉంది. దీనిని ముఖాముఖి ఎదుర్కొనవలసని అవసరం ఉంది. ఇది ప్రాథమికంగా అన్యాయమైన అభియోగమే అయిన్పటికీ ఇందులో అప్పుడప్పుడు కొంచెం సత్యం ఉంది కాబట్టే, అసత్యాన్ని చూడడానికి ప్రజాతంత్రవాదులు సిద్ధంగా లేరు కాబట్టే, ఆ అభియోగంతో ముఖాముఖి తలపడలేక పోతున్నారు. పీడనకు గురయ్యేవారు చేసే తప్పిదాలను దానిమూలాల కారణంగా ఎప్పుడు సమర్థించవచ్చును, ఎప్పుడు సమర్థించకపోయినా సానుభూతితో చూడవచ్చును, ఎప్పుడు నిర్మొహమాటంగా వ్యతిరేకించాలి అన్న విచక్షణను ప్రజాతంత్ర ప్రాపంచిక దృక్పథం నేర్చుకోలేదు. నేర్చుకోవడానికి సిద్ధంగానూ లేదు. పీడనకు గురయ్యే సామాజిక వర్గాల వారు కూడా ఆ మూలం పేరు చెప్పి తమ

తప్పులను గానీ బాధ్యతారహితమైన ప్రవర్తనను గానీ సమర్థించుకోవడం ఎప్పుడు సబబు, ఎప్పుడు అనైతికం అన్న విచక్షణను అన్ని సందర్భాలలోనూ పాటించడం లేదు. ఇది ఒక్క దళితవర్గాలలోనే కాదు, అన్ని పీడిత ప్రజా ఉద్యమాలలోనూ తరచుగా తలెత్తుతున్న వైఖరి. ఈ బలహీనత గురించి మాట్లాడేకోలేకపోవడం, దానికొక పేరు పెట్టలేకపోవడం, ఒక పక్కనున్న సమస్య కాగా దానినే మొత్తం చేసి చూపించడం రెండవ పక్కనుండి వస్తున్న ఒత్తిడి. ఆ ఒత్తిడికి ఎట్టి పరిస్థితిలోనూ లొంగడానికి వీలు లేదు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని సమస్య విద్యార్థుల మెస్ నిర్వహణ దగ్గర మొదలయింది. చీఫ్‌వార్డెన్‌గా వచ్చిన ఒక చంద్రబాబునాయుడు మెస్ కొనుగోళ్ళు కాంట్రాక్టర్‌కు ఇవ్వాలనుకుని ప్రతిపాదించాడు. దానిని విద్యార్థులు, ముఖ్యంగా దళిత విద్యార్థులు వ్యతిరేకించారు. దానివలన ఇప్పటికే వేగంగా పెరుగుతున్న మెస్‌బిల్ మరింత పెరుగుతుందని వారి ఆందోళన. అదే వారి ఆందోళన కాదనీ, ఇప్పటిదాకా మెస్ నిర్వహణ చూసుకుంటున్న దళిత విద్యార్థులు కొనుగోళ్ళ పేరిట కొంచెం మిగుల్చుకుంటున్నారనీ, ఆ అవకాశం పోతుందని వారు ఆందోళన చెందుతున్నారనీ ఒక జవాబు. అయితే 'మిగుల్చుకోవడం' ఎవరు నిర్వహణ చేపట్టినా చేసేదేననీ, అంతేకాక ఆమాత్రం అవకాశం ఉండబట్టే పెరుగుతున్న మెస్ బిల్లులకు దళిత విద్యార్థులు తట్టుకోగలుగుతున్నారనీ దీనికి సమాధానం. నిజానికి రాబోయే కాంట్రాక్టర్ 'మిగుల్చు'కోడా? అయితే దానిని అవినీతి అనరు, 'మార్జిన్' పెంచుకునే బిజినెస్ నైపుణ్యం అంటారు. దళిత విద్యార్థుల మీద ఈ విషయంలో వేస్తున్న అభియోగం నిజమైతే మనం దాని గురించి ఎందుకు మాట్లాడుకోకూడదు? ఒకవేళ ఆ బలహీనత పట్ల - అది నిజమయితే - సానుభూతి చూపించగలిగినా, ఎందుకు మాట్లాడుకోకూడదు? ఆ బలహీనతకు లొంగడం వల్ల అధిక మెస్‌బిల్లుల సమస్య ఒక రాజకీయ సమస్య కాకుండా పోవడం, ఒక ఉద్యమ అంశం కాకుండా పోవడం విచారకరమనైనా ఎందుకు అనకూడదు?

ఇక్కడిదాకా 'మీ వాళ్ళలోనూ లోపాలున్నాయి' అనడానికి ప్రత్యర్థులకు కొంత అవకాశం ఉందిగానీ వార్డెన్ రత్నంతో చీఫ్ వార్డెన్ వ్యవహరించిన వైనం కుల అహంకారానికి పరాకాష్ఠ. దళితుడయిన రత్నం మెస్ కొనుగోళ్ళ ప్రైవేటీకరణ ప్రతిపాదనను వ్యతిరేకించారు. అంటే చీఫ్ వార్డెన్ విధానాన్ని వ్యతిరేకించారు. అందులో ఆయనకేదో స్వార్థముందన్న అభియోగం సహితం లేదు. అయితే ఈ వ్యతిరేకత నేపథ్యంలో చీఫ్ వార్డెన్ అతని అధికారాలు కత్తిరించి, మెస్‌లో పారిశుధ్యం వంటివి ఆయనను చూసుకొమ్మని చెప్పి ఆర్థిక వ్యవహారాలు ఒక బ్రాహ్మణుడికి అప్పగించాడు. అంటే పాకీపని నువ్వు చేయి, కరణీకం మావాడు చేస్తాడు అన్నాడు. ఏ యూనివర్సిటీలోనూ ఎప్పుడూ జరగని ఈ 'పని విభజన' అసహ్యమే కాక ఆశ్చర్యం కూడా కలిగించవచ్చు. 'ఉన్నత విద్యాసంస్థల' అంతర్గత సంస్కృతితో చాలామందికి పరిచయం లేదు కాబట్టే అటువంటి సంభ్రమం కలుగుతుంది. రత్నంకు జరిగిన ఈ అవమానానికి దళిత విద్యార్థులు స్పందించటం సహజం. తాము క్యాంపస్‌లో అడుగు పెట్టిన నాటినుండి విభిన్న రూపాలలో అనుభవించిన అవమానాన్ని అందులో చూసుకోవడం సహజం. ఆ అవమానాలు తక్కువని ఎవరైనా అనుకుంటే పొరబాటే. తెలుగు మీడియంలో ప్రభుత్వ కాలేజీలో డిగ్రీ చదువుకొని ఒక్కసారిగా హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో పి.జి. కోర్సులో అడుగు పెట్టిన దళితేతర విద్యార్థులు సైతం తొలి రోజులలో తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి కష్టపడాలి. తమ కుటుంబాలలో మొదటితరం విద్యావంతులయిన దళిత విద్యార్థులకు అది మరీ కష్టం. పైగా రిజర్వేషన్‌ల పుణ్యాన అర్హత లేని చోటికి చేరిన అసమర్థులు అనే హేళన వారికి నిత్యం ఎదురవుతూ ఉంటుంది. సైన్స్ శాఖలలో-తమ గురించి తాము గొప్ప 'ప్రతిభావంతులమ'నుకునేవారు విర్రవీగే డిపార్టమెంట్లలో- ఇది మరీ ఎక్కువ. మొన్న రెస్టికేట్ అయిన విద్యార్థులు అధికభాగం సైన్స్ డిపార్ట్‌మెంట్లకు చెందినవారే.

మొత్తానికి అన్ని కారణాలూ కలిసి దళిత విద్యార్థులకు కోపం వచ్చింది. మెస్ కొనుగోళ్ళ పాలసీ విషయమై చీఫ్ వార్డెన్‌తో మాట్లాడటానికి వెళ్ళిన వాళ్ళు అదుపు తప్పి అడ్డమొచ్చిన వాళ్ళను కొట్టారు. వారి చేతుల్లో దెబ్బలు తిన్న లెక్చరర్ రాజశేఖర్ కూడా దళితుడే కావడం, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం క్యాంపస్ శాఖల వారిపైన క్రమశిక్షణ చర్య తీసుకోవాలని పట్టుబట్టడం, దళిత విద్యార్థులకు వేరే సందర్భంలో వచ్చి ఉండగల సానుభూతిని తగ్గించింది. క్యాంపస్‌లో పెత్తందారీ కులాలలకు ఈ పరిస్థితి చాలా బలాన్ని ఇచ్చింది. హింసకు పాల్పడిని అంబేద్కర్ విద్యార్థి సంఘం సభ్యులకు తగిన బుద్ధి చెప్పాలనీ క్యాంపస్ నుండి వారిని బహిష్కరించడం తప్ప వేరే మార్గం లేదనీ గొడవ చేసారు. అంబేద్కర్ విద్యార్థి సంఘం సభ్యులు గతంలో కూడా ఎవరితోనైనా ఘర్షణకు దిగినప్పుడు కొట్టడం చాలాసార్లు జరిగిందనీ ఆ కోపమంతా ఇప్పుడు బయల్పడిందనీ సానుభూతిపరులు సహితం అనసాగారు. రాజకీయ హింసపై పెద్దగా అభ్యంతరం లేనివారు సహితం వారి దౌర్జన్యకరమైన గత చరిత్ర ఇప్పుడు సానుభూతి లేకుండా చేసిందని అన్నారు.

దళిత విద్యార్థులు బలప్రయోగాన్ని ఒక అలవాటుగా మలచుకున్నది నిజమే అయితే దాని వెనకనున్న నిరసనను అర్థం చేసుకోగలం. అయినప్పటికీ అలవాటును విమర్శించగలగాలి. ఒక తప్పును అర్థం చేసుకునేటప్పుడు కార్యకారణ సంబంధాలను మాత్రమే చూస్తాం. దానిని రాజకీయంగా విశ్లేషించేటప్పుడు దీర్ఘకాల పర్యవసాలనూ సామాజిక పరిణామానికి అది చేయగల చేటునూ కూడా చూస్తాం. చూడడానికి సిద్ధంగా లేకపోవడం తాత్కాలికంగా ఎంత గొప్ప వైఖరిగా అనిపించినా దీర్ఘకాలంలో పీడిత ప్రజలకే నష్టం చేస్తుంది. తాము ఒక రస్టికేషన్ ఆర్డర్‌తో తెర దించివేయాలనుకున్న ఘటనకు ఇన్ని కోణాలు ఉన్నాయని ప్రముఖ మేధావులయిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం పాలకవర్గం చూడలేకపోవచ్చు. లేదా చూడగలరు కాబట్టే తొందరగా తెర దించేద్దామనుకున్నారో!

ఏదైనా, ఇంత సంక్లిష్టమైన సమస్యకు రస్టికేషన్ ఏ రకంగానూ న్యాయమైన జవాబు కాదు. విచారణ సహితం జరపని రస్టికేషన్ అసలే కాదు. ఏమైనా నిజాయితీ ఉన్నట్లయితే ఆ విశ్వవిద్యాలయం పెద్దలు తమ క్యాంపస్‌ను సంస్కరించుకోవాలి. దళిత విద్యార్థులకు శత్రు దేశంలో సంచరిస్తున్నామన్న అనుభూతి కలగని స్నేహవాతావరణం కల్పించాలి. ఇటు ఉద్యమకారులూ పీడిత ప్రజల శ్రేయోభిలాషులూ పీడన నుండి పుట్టిన నిరసన తీసుకునే అన్ని రూపాలనూ అర్థం చేసుకునే దగ్గర ఆగిపోకుండా, పీడనను అంతం చేసే దిశగా ప్రజలు నడవడానికి అవసరమైన విమర్శలను, సలహాలనూ నిర్మొగమాటంగా అందియ్యడానికి సిద్ధపడాలి. ముందుగా పదిమంది దళిత విద్యార్థుల రస్టికేషన్‌ను ఎత్తి వేయించడానికి అందరూ కలిసి పని చేయాలి.